సాక్షి
కామారెడ్డి

శుక్రవారం । 15 । మార్చి । 2024



సంక్షేమ ఫలాలు అందాలి

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి గడపకు అందాలని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- IIలో ▸



గరిష్టం/కనిష్టం
36.7 /17.8

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా శ్రీనివాస్ రెడ్డి



కామారెడ్డి క్రైం: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా దవలాపూర్ శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. గురువారం ఆయన కామారెడ్డికి విచ్చేసి కలెక్టరేట్‌లో పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. కొంతకాలంగా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ఆయనను రాష్ట్ర ప్రభుత్వం కామారెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఇక్కడ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పనిచేసిన మనుచౌదరి సిద్దిపేట కలెక్టర్‌గా వెళ్లిన విషయం తెలిసిందే.

జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారిగా అంబాజీ

కామారెడ్డి గిరిజన అభివృద్ధి శాఖ జిల్లా అధికారిగా అంబాజీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కొద్దిరోజులుగా జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిణి రజిత గిరిజన అభివృద్ధి శాఖకు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. నిర్మల్ జిల్లా గిరిజన అభివృద్ధిగా పనిచేసిస్తున్న అంబాజీ బదిలీపై కామారెడ్డికి వచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం నుంచి ఒంటిపూట తరగతులు ప్రారంభిస్తున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఆదేశించారు. ఉదయం 7.55 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు తరగతులు కొనసాగనున్నాయి.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి టౌన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ముగిశాయి. గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్ పరీక్షలు జరిగాయి. చివరి రోజు 7,252 మంది విద్యార్థులకు గాను 7,042 మంది పరీక్షకు హాజరయ్యారు. 210 మంది పరీక్ష రాయలేదు. అలాగే వొకేషనల్‌లో 948 విద్యార్థులకు గాను 893 హాజరై 55 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు హుషారుగా ఇళ్లకు వెళ్లారు.

హైవేపై లారీ దగ్ధం



డిచ్‌పల్లి: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మెంట్రాజ్‌పల్లి శివారులో 44 వ నెంబరు జాతీయ రహదారిపై గురువారం రాత్రి ప్రమాదవశాత్తు డీజిల్ ట్యాంకు పేలి లోడ్‌తో వెళుతున్న లారీ దగ్ధమైంది. భారీ యంత్రాల బెల్టుల లోడ్‌తో తమిళనాడు నుంచి మహారాష్ట్ర రాయచూర్ వెళుతున్న లారీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో డ్రైవర్ వెంటనే లారీని రోడ్డు పక్కకు తీసుకుని నిలిపివేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఫైరింజన్ ఘటనా స్థలానికి చేరుకునే లోపే లారీ మొత్తం మంటల్లో కాలిపోయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని డిచ్‌పల్లి ఎస్సై మహేశ్ తెలిపారు. ఘటనతో రహదారిపై కొద్దిసేపు వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ జాం ఏర్పడింది. పోలీసులు వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు.

బిజినెస్ టీచర్లలో వణుకు!

- ఆకస్మిక తనిఖీలతో హడలగొడుతున్న ఎమ్మెల్యే
- విధులకు ఎగనామం పెట్టి వ్యాపారాలు చేసేవారిపై ఫోకస్
- తనిఖీల్లో ఉపాధ్యాయుడికి బదులు మరొకరు విధుల్లో..
- ఎమ్మెల్యే ఆదేశాలతో టీచర్‌ను సస్పెండ్ చేసిన అధికారులు
- ఎప్పుడు ఏ స్కూల్‌ను తనిఖీ చేస్తారోనన్న భయం



మాచారెడ్డి మండలం ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కేవీఆర్ (ఫైల్)

సాక్షి, కామారెడ్డి: విధులకు ఎగనామం పెడుతూ సొంత వ్యాపారాల్లో మునిగి తేలుతున్న ఉపాధ్యాయుల్లో వణుకు మొదలైంది. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి బిజినెస్ టీచర్లపై ఫోకస్ చేశారు. వారం రోజులుగా స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీలు చేస్తుండడంతో హడలిపోతున్నారు. ఈనెల 13న రాజంపేట మండలం ఆరెపల్లి తండాలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడ పనిచేసే ఉపాధ్యాయుడు అయిత బాలాజీ అధికారుల అనుమతి లేకుండా, సెలవు పెట్టకుండా పాఠశాలకు రావడం లేదని గుర్తించారు. ఆయనకు బదులు తండాకు చెందిన ఓ మహిళ విధుల్లో ఉండడంతో ఆశ్చర్యపోయిన ఎమ్మెల్యే అధికారులకు ఫోన్‌చేసి నిలదీశారు. దీంతో విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి అప్పటికప్పుడు సదరు టీచర్ బాలాజీని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు బిజినెస్ టీచర్లు అధికారులను మచ్చిక చేసుకుని విధులకు హాజరుకావడం లేదనే విమర్శలున్నాయి. ఎమ్మెల్యే తనిఖీ చేసేదాకా టీచర్లు రోజుల తరబడి స్కూళ్లకు రావడం లేదన్న విషయం అధికారులకు తెలియకపోవడం విస్మయం కలిగిస్తోంది. కొందరు టీచర్లు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. భిక్కనూరు, రాజంపేట, బీబీపేట, దోమకొండ, మాచారెడ్డి, కామారెడ్డి, తాడ్వాయి, సదాశివనగర్, రామారెడ్డి తదితర మండలాల్లో పనిచేసే ఉపాధ్యాయులు కొందరు హైదరాబాద్ నుంచి వచ్చి వెళ్తున్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ప్రార్థనా సమయానికి పాఠశాలకు చేరుకోవాల్సి ఉన్నా.. చాలా మంది ఆలస్యంగా వస్తున్నట్లు తెలుస్తోంది. ఒంటిపూట బడులు మొదలైన నేపథ్యంలో ఉదయం ఎనిమిది గంటలకే స్కూళ్లకు ఎలా చేరుకుంటారో వారికే తెలియాలి!

తనిఖీలతో తల్లడంమల్లడం..

ఎమ్మెల్యే స్కూళ్లను తనిఖీ చేస్తుండడంతో డుమ్మా మాస్టర్లు తల్లడంమల్లడం అవుతున్నారు. కొందరు టీచర్లు బిజినెస్‌లు చేస్తూ విధులకు డుమ్మా కొడుతుండగా, మరికొందరు డీఈవో కార్యాలయం చుట్టే తిరుగుతున్నారు. ఏదో ఒక పని పేరుతో స్కూళ్లకు వెళ్లడం లేదు. రోజుల తరబడిగా స్కూళ్ల ముఖం చూడని వారున్నారు. జిల్లా కేంద్రంలో జరిగే కార్యక్రమాలకు సంబంధం లేకున్నా, కొందరు విధులకు ఎగనామం పెట్టి ఆయా కార్యక్రమాలకు హాజరవుతున్నారు. మరికొందరు ఉపాధ్యాయులు రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులతో అంటకాగుతూ వాళ్లతో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. రాజకీయ నాయకుల అండ ఉందని అధికారులను లెక్కచేయడం లేదు. ఎమ్మెల్యే తనిఖీల నేపథ్యంలోనైనా అధికారులు తమ బాధ్యతలు గుర్తెరిగి, స్కూళ్లను తనిఖీ చేయాల్సిన అవసరం ఉంది.

వారం రోజులుగా ఎమ్మెల్యే తనిఖీలు

ఎమ్మెల్యే కేవీఆర్ వారం రోజులుగా నియోజకవర్గంలో స్కూళ్లను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. అందులో భాగంగా ఈనెల 12న నియోజకవర్గంలోని విద్యాశాఖ అధికారులు, క్లస్టర్ హెడ్మాస్టర్లు, హెడ్ మాస్టర్లతో తన క్యాంపు కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి సమయపాలన పాటించేలా చూడాలని స్పష్టం చేశారు. తాను తనిఖీలు నిర్వహిస్తానని చెప్పి పంపించారు. కాగా ఎమ్మెల్యే తనిఖీ చేసిన సమయంలో దోమకొండలో పనిచేసే ఓ ఉపాధ్యాయ సంఘం నాయకుడు విధులకు గైర్హాజరైనట్లు గుర్తించి వార్నింగ్ ఇచ్చారు. కామారెడ్డి మండలంలోని క్యాసంపల్లిలో పనిచేసే ఉపాధ్యాయుడు డీఎస్‌వో పేరుతో విధులకు గైర్హాజరైన విషయంలో సీరియస్ అయ్యారు. మాచారెడ్డి, బీబీపేట, భిక్కనూరు తదితర మండలాల్లోనూ పలు పాఠశాలలను తనిఖీ చేశారు. కాగా ఎమ్మెల్యే తనిఖీల నేపథ్యంలో టీచర్లలో వణుకు మొదలైంది. దీంతో రెగ్యులర్‌గా విధులకు హాజరయ్యే ప్రయత్నం చేస్తున్నారు.

వ్యాపారాలతో బిజీబిజీ..

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు చాలామంది రెగ్యులర్‌గా విధులకు హాజరవుతూ, పిల్లలకు మంచి బోధన అందిస్తున్నారు. అలాంటి టీచర్ల వల్లే ఇప్పటికీ ప్రభుత్వ బడులు మనుగడ సాధించగలుగుతున్నాయి. కానీ కొందరు మాత్రం విధులకు ఎగనామం పెడుతూ సొంత వ్యాపారాల్లో తలమునకలవుతున్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్, నిర్మాణరంగం, హోటళ్లు, లాడ్జీల నిర్వహణ, ప్రైవేటు కాలేజీలు, స్కూళ్లు, ఫైనాన్స్, చిట్స్ ఆఖరుకు మద్యం దందాలోనూ కొందరు భాగస్వాములుగా ఉన్నారు. మరికొందరు టీచర్లు బిజినెస్ పార్టనర్లతో కలిసి రెగ్యులర్‌గా విదేశీ టూర్లకూ వెళ్తున్నారు. టూర్లకు వెళ్లే సమయంలో కూడా కొందరు సెలవులు కూడా పెట్టుకోలేదన్న ఆరోపణలున్నాయి.

రసవత్తరంగా బల్దియా రాజకీయం

- కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌పై 30న అవిశ్వాస సమావేశం
- కౌన్సిలర్లకు నోటీసులను అందజేసిన కలెక్టర్
- క్యాంపునకు తరలిన 27 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కామారెడ్డి బల్దియాలో మున్సిపల్‌లో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రవేశపెట్టేందుకు కౌన్సిలర్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు ఇటీవల నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. దీంతో తాజాగా ఈనెల 30న అవిశ్వాస సమావేశం ఏర్పాటు చేస్తూ 49 మంది కౌన్సిలర్లు హాజరుకావాలని కలెక్టర్ నోటీసులను అందజేశారు. అవిశ్వాస సమావేశానికి ఉదయం 11 గంటలకు హాజరుకావాలని కోరారు.

క్యాంపు రాజకీయం షురూ

చైర్ పర్సన్ పీఠాన్ని ఎలాగైనా కైవసం చేసుకోవాలని పట్టుబట్టిన కాంగ్రెస్ తన కౌన్సిలర్లను క్యాంపునకు తరలించింది. వీరంతా హైదరాబాద్‌లోని ఓ రిసార్ట్‌లో ఉన్నట్లు సమాచారం.

అవిశ్వాసంపై ఉత్కంఠ

కలెక్టర్ నోటీసులతో నెలాఖరున జరిగనున్న అవిశ్వాస సమావేశంపై ఉత్కంఠ నెలకొంది. అయితే అవిశ్వాసం ప్రవేశపెట్టాలంటే 34 మంది సభ్యుల కోరం తప్పకుండా హాజరవ్వాల్సి ఉంటుంది. ఒక్కరు తగ్గినా అవిశ్వాసం వీగిపోయినట్లు ప్రకటిస్తారు. మొత్తం సభ్యుల్లో 34 మంది చైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఓటు వేస్తేనే అవిశ్వాసం నెగ్గుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఇప్పటికే 27 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఇంకా ఏడుగురు సభ్యులు కావాల్సి ఉంది. అతిత్వరలో ఇద్దరు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం. మరో ఐదుగురు చైర్‌పర్సన్ దిగిపోవడానికి కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతామని చైర్‌పర్సన్ తండ్రి ఎదుట బహిరంగంగానే తెలిపినట్లు తెలిసింది. మరోవైపు చైర్‌పర్సన్ తండ్రి నిట్టు వేణుగోపాల్‌రావుకు మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ మధ్య సఖ్యత లోపించినట్లు సమాచారం. ఈ వైరం కాంగ్రెస్‌కు మేలు చేస్తుందా అనే సందేహం వ్యక్తమవుతోంది. ఒక వేళ మాజీ ఎమ్మెల్యే అవిశ్వాసంపై స్పందించకపోతే బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌కు మద్దతు తెలిపే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ఒక వేళ 16 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లను క్యాంపునకు తరలిస్తే మాత్రం అవిశ్వాసం వీగిపోనుంది. మరోవైపు చైర్‌పర్సన్ తండ్రి పార్టీ మారుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. బీజేపీకు చెందిన ఆరుగురు కౌన్సిలర్లు అవిశ్వాసానికి దూరంగా ఉంటామని ఇప్పటికే తెలిపారు.

ఏటీఎం ధ్వంసం.. రూ.20 లక్షలు చోరీ

రుద్రూర్: రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంను దుండగులు ధ్వంసం చేసి రూ. 20 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. చోరీకి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో వాహనంలో వచ్చిన దుండగులు సమీపంలోని సీసీ కెమెరాలపై బ్లాక్ కలర్ స్ప్రే చేసి ఏటీఎం గదిలోకి చొరబడ్డారు. మిషన్‌ను ధ్వంసం చేసి రూ. 20 లక్షలు ఎత్తుకెళ్లారు. మిషన్ భాగాలను బయట పారవేశారు. కేవలం 15 నిమిషాల్లోనే తమ పని పూర్తి చేసుకొని పరారయ్యారు. రుద్రూర్– బోధన్ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి వరకు వాహనాల రాకపోకలు కొనసాగడంతో పాటు పోలీసులు పెట్రోలింగ్ చేస్తుంటారు. అయితే చోరుల్లో ఏటీఎం గురించి పూర్తిగా తెలిసిన వారే ఉండి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్తున్న వారు రోడ్డుపక్కన ఏటీఎం భాగాలు పడి ఉండడాన్ని గమనించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు శాఖ ఉన్నతాధికారులకు విషయాన్ని తెలిపారు. గురువారం ఉదయం బోధన్ ఏసీపీ శ్రీనివాస్, రుద్రూర్ సీఐ జయేశ్‌రెడ్డి, వర్ని ఎస్సై కృష్ణకుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సమీపంలోని వ్యాపార సముదాయాల సీసీ కెమెరా ఫుటేజీలను సేకరించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దుండగుల కోసం గాలిస్తున్నారు.

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అధికారులు

- స్వశక్తి మహిళా సంఘాలకు నిర్వహణ బాధ్యతలు
- కమిటీల ఆధ్వర్యంలో మౌలిక వసతుల కల్పన
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి

కామారెడ్డి క్రైం: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. గురువారం హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రెటరీ మాట్లాడుతూ.. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల నిర్వహణ బాధ్యతలను స్వశక్తి మహిళా సంఘాలకు అప్పగించనున్నట్లు తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలకు కమిటీలను సత్వరమే ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. కమిటీలో మహిళా సంఘం నాయకురాలు అధ్యక్షురాలిగా, పాఠశాల హెచ్‌ఎం మెంబర్ కన్వీనర్‌గా ఉంటారన్నారు. గ్రామంలో 2, 3 మహిళా సంఘాలు ఉంటే పాఠశాలకు దగ్గరగా ఉన్న మహిళా సంఘానికి మొదటి సంవత్సరం అవకాశం కల్పించాలన్నారు. కమిటీ అధ్యక్షులు, మెంబర్ కన్వీనర్ కలిసి విద్యార్థుల తల్లులను కమిటీ సభ్యులుగా ఎంపిక చేస్తారని, ఈ కమిటీ రెండేళ్ల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. కమిటీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ప్రారంభించాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధి పనులు కమిటీల ఆధ్వర్యంలోనే నిర్వహించనున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనులను గుర్తించి కలెక్టర్లు వెంటనే పరిపాలన అనుమతులు మంజూరు చేసి జిల్లా సమాఖ్యకు అప్పగించాలన్నారు. ఇంజినీరింగ్ అధికారులను మండలాల వారీగా ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీలుగా నియమించాలన్నారు. సదరు ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన ప్రతిపాదనలను జిల్లా సమాఖ్యకు, కలెక్టర్లకు సమర్పించాలని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా రూ. 25వేల వరకు అత్యవసర నిధులు వినియోగించవచ్చని తెలిపారు. వీసీలో కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్, సీపీవో రాజారాం, డీఆర్డీవో చందర్ నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రజిత, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా గిరిజన అభివద్ధి అధికారి అంబాజీ, డీఈవో రాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నైరాశ్యం..!

- కారు దిగి కాంగ్రెస్ గూటికి చేరుతున్న నేతలు
- తాజాగా షబ్బీర్‌ను కలిసిన బీబీపేట నాయకులు



ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని కలిసిన బీబీపేట మండల బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, కామారెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం కోల్పోవడంతో బీఆర్‌ఎస్‌లో నేతల్లో నైరాశ్యం అలుముకుంది. తెలంగాణ ఉద్యమం నుంచి నిన్న మొన్నటి దాకా ఆ పార్టీ క్రియాశీలకంగా పనిచేసిన నేతల్లో సైతం నిరాశగా ఉన్నారు. రాష్ట్ర సాధనోద్యమంలో కీలకంగా పనిచేసిన ఉద్యమకారులు, నాయకులు ఒక్కొక్కరుగా పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరుతున్నారు. కామారెడ్డి నియోజక వర్గంలోని వివిధ మండలాలకు చెందిన స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు హస్తం తీర్థం పుచ్చుకుంటున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు అండగా నిలిచిన బీబీపేట మండలానికి చెందిన ముఖ్యనేతలంతా కారు దిగేందుకు రెడీ అయ్యారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్ గౌడ్, వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే సోదరుడు, తుజాల్‌పూర్ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మట్ట శ్రీనివాస్‌తో పాటు మరికొందరు నేతలు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, మాజీ ఎమ్మెల్యే యాసుఫ్‌అలీలను కలిశారు. త్వరలోనే వారు కాంగ్రెస్ గూటికి చేరుతారని తెలుస్తోంది. మాచారెడ్డి సొసైటీ చైర్మన్ ఫూల్‌చంద్‌నాయక్ ఇటీవలే కాంగ్రెస్‌లో చేరారు. దోమకొండ, భిక్కనూరు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇరవై మంది కౌన్సిలర్లు హస్తం తీర్థం పుచ్చుకున్నారు. ఉద్యమం ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన పట్టణానికి చెందిన రమేశ్‌గుప్తా ఇటీవలే పార్టీకి రాజీనామా చేశారు.

పావులు కదుపుతున్న కాంగ్రెస్ ముఖ్య నేతలు

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీల నేతలు, కార్యకర్తలను పెద్ద సంఖ్యలో పార్టీలో చేర్చుకోవడం ద్వారా ఎన్నికల్లో తమ పార్టీని గెలిపించుకోవాలని కాంగ్రెస్ నాయకులు పావులు కదుపుతున్నారు. జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులను తమ వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో పెద్ద సంఖ్యలో నేతలు కాంగ్రెస్ గూటికి చేరారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడంతో ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు వరుస కడుతున్నారు. దీంతో జిల్లాలో బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా నష్టపోతుందని భావిస్తున్నారు.


నాడు సర్పంచ్.. నేడు ఉపాధి కూలీ..



నర్సన్నపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న ప్రజాప్రతినిధులు

కామారెడ్డి రూరల్: ఉపాధిహామీ పథకానికి ప్రజాప్రతినిధులు వెళ్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కామారెడ్డి మండలం నర్సన్నపల్లికి చెందిన మాజీ సర్పంచ్ ద్యాప రాజు ప్రస్తుతం ఉపాధి పనులకు వెళ్తున్నాడు. మాజీ వార్డు సభ్యుడు ద్యాప అంజయ్య, మాజీ ఎంపీటీసీ ఏలూరి బాల్‌రాజు, కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ద్యాప లింగం, ఏలూరి లింగం, ద్యాప రవి, రాసమొల్ల నారాయణ, పిట్ల నారాయణలు సైతం ఉపాధి పనులకు వెళ్తున్నారు. గ్రామాభివృద్ధికోసం కాల్వలు తీయడం, పూడిక తీయడం వంటి పనులు చేయడం సంతోషంగా ఉందని వారు తెలిపారు.

రైతులను మోసం చేయవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఎరువులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయించే డీలర్లు వ్యవసాయ రంగంపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే రైతులకు నాణ్యమైన రకాలను అందించడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఆరుగాలం కష్టించి పనిచేసే రైతుల మోసం చేయవద్దని సూచించారు. విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు విక్రయించే ఇన్‌పుట్ డీలర్లకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వ్యవసాయ విస్తరణ సేవ డిప్లొమా కోర్సు శిక్షణ తరగతులను గురువారం కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో బ్యాచ్‌లో 40 మంది డీలర్ల చొప్పున ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్ సంస్థ ప్రతినిధి సుధారాణి, డీఏవో భాగ్యలక్ష్మి, శిక్షకులు నరసింహాచారి, రామచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి సంరక్షణ పనులు చేపట్టాలి

ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం ఉపాధి హామీ పథకంపై మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి నిల్వ కుంటలు, పర్కులేషన్ ట్యాంకులు, కంటూర్ కందకాలను ఉపాధి కూలీలతో తవ్వించాలన్నారు. తద్వారా భూగర్భ జలాల పెంపునకు దోహదపడాలన్నారు. పనులకు కూలీలు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చూడాలని పేర్కొన్నారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించాలన్నారు. చెరువుల్లో పూడికమట్టిని తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్‌డీవో చందర్ నాయక్ పాల్గొన్నారు.

నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి

- యాసంగికి కరెంట్ కోతలు ఉండొద్దు
- అధికారులతో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్: నియోజకవర్గంలో ప్రజలకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, విద్యుత్, ఇరిగేషన్, మిషన్ భగీరథ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మిషన్ భగీరథ నీరు నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్, గ్రామాల్లో నిబంధల మేరకు అనుమతులు ఇవ్వాలని సూచించారు. అక్రమ లే అవుట్ ఉండకూడదన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలన్నారు. యాసంగి పంటకు కరెంటు ఇబ్బందులు లేకుండా చూడాలని పేర్కొన్నారు. మున్సిపల్‌లో కుళాయిల ద్వారా సరఫరా అయ్యే నీరు కలుషితంగా వస్తున్నాయని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు మెగాలోక్ అదాలత్

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి మున్సిఫ్ కోర్టులో ఈనెల 16న మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్సై మహేశ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ చేసుకోదగ్గ కేసులకు సంబంధించి మెగాలోక్ అదాలత్‌లో పరిష్కారం ఉంటుందని అన్నారు. దీనిని వినియోగించుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ త్వరలోనే పూర్తి



ఎల్లారెడ్డి: ఎస్సీ వర్గీకరణ లక్ష్యం త్వరలో పూర్తవుతుందని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎల్లారెడ్డిలో ఎమ్మార్పీఎస్, ఎంపీఎస్ జహీరాబాద్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు కమిటీ వేసిందని, దీనిపై సుప్రీంకోర్టులో చర్చ జరిగి త్వరలో వర్గీకరణకు అనుకూలంగా తీర్పు రానుందన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు బీజేపీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పద్మారావు, అబ్రహం, చిరంజీవి, మాణిక్యం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి మోదీ సర్కార్ పక్కా

లింగంపేట: విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం ఢిల్లీ నుంచి రథం లింగంపేటకు చేరుకున్న సందర్భంగా బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మరోసారి మోదీ సర్కార్ పక్కా అని తెలంగాణలో 17 ఎంపీ స్థానాలు బీజేపీ కైవసం చేసుకొని మోదీ సర్కార్ ఏర్పడబోతుందని పార్టీ మండల అధ్యక్షుడు మాసల శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, బొల్లారం సాయిలు, రాజారాం సాయిలు, ప్రసాద్, అనిల్, గణేశ్, సాయిలు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణకు కొత్త పద్ధతులు



భిక్కనూరు: క్యాన్సర్ వ్యాధి నివారణకు కొత్త పద్ధతులు అందుబాటులోకి వస్తున్నాయని తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణచందర్‌రావు అన్నారు. తెయూ సౌత్‌క్యాంపస్‌లో క్యాన్సర్ చికిత్సలో ప్లేవనాయిడ్స్ పాత్రపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్లేవనాయిడులు ఆర్వోఎస్ హోమియోస్టాటిస్‌కు సంబంధించి ద్వంద చర్యలను కలిగి ఉంటాయన్నారు. అవి సాధారణ పరిస్థితుల్లో యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయన్నారు. అనంతరం ప్రొఫెసర్లు పూర్ణచందర్‌రావును సన్మానించారు. కార్యక్రమంలో సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్ సుధాకర్‌గౌడ్, రసాయన శాస్త్రం విభాగాధిపతి నాగరాజు, ఫిజిక్స్ హెచ్‌వోడీ హరిత, ప్రొఫెసర్లు మోహన్‌బాబు, లలిత, నిరంజన్‌శర్మ, శ్రీకాంత్, సునీత పాల్గొన్నారు.

వందశాతం పన్ను వసూలు చేయాలి

● డీపీవో శ్రీనివాసరావు



భిక్కనూరు: ప్రతి గ్రామంలో వందశాతం పన్ను వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్‌రావు సూచించారు. భిక్కనూరు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళికలను తయారు చేయడంలో సంబంధిత అన్ని శాఖల నుంచి ప్రగతి నివేదికలను తీసుకుని తయారు చేయాలన్నారు. వేసవిలో తాగునీటికి ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీవో ప్రవీణ్‌కుమార్, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలు అందేలా చూడాలి

● జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

బిచ్కుంద: నిరుపేదల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి గడపకు అందాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని బండారెంజల్‌లో జీపీ నూతన భవనం, సీతారాంపల్లిలో పీఏసీఎస్ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే గురువారం భూమి పూజ చేశారు. ఖద్గాంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతిపక్ష కార్యకర్తలకు కూడా అందేలా చూడాలని పార్టీ కార్యకర్తలను కోరారు. బండారెంజల్‌లో అభివృద్ధికి పెండింగ్‌లో ఉన్న రూ.55 లక్షల నిధుల మంజూరుకు తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ప్రతి నియోజకవర్గానికి ప్రభుత్వం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. జుక్కల్ అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఖాళీ స్థలం ఉన్న వారు ఇందిరమ్మ పథకం కింద నిర్మించుకోవచ్చని, లబ్ధిదారులు ముందుకు వచ్చి నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు గ్రామాల్లోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగెట్ విఠల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నాగ్‌నాథ్ పటేల్, వెంకట్‌రెడ్డి, నాగ్‌నాథ్, సొసైటీ చైర్మన్ భీంరెడ్డి, గంగాధర్, శంకర్ పటేల్ పాల్గొన్నారు.



జీపీ భవనం కోసం భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

గురువుల పాత్ర గొప్పది

నిజాంసాగర్(జుక్కల్): సమాజంలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం పిట్లం మండల కేంద్రంలో పీఆర్టీయూ నాయకులు నిర్వహించిన ఉపాధ్యాయుడు గణేశ్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గురువులేని విద్య గుడ్డి విద్య అలాంటి గురువులను విస్మరించవద్దన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్, జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి కుశాల్, ఎంఈవో దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలి

గిరిజన తండాలకు బీటీ రోడ్ల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇవ్వాలని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అధికారులను ఆదేశించారు. మండలంలోని అటవీ శాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గిరిజనతండాలు, గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నా అటవీశాఖ అభ్యంతరాలతో పనులు నిలిచిపోతున్నాయని అన్నారు. అటవీ ప్రాంత సరిహద్దు సాగులో ఉన్న భూములకు సంబంధించి జాయింట్ సర్వేలు చేపట్టి రైతులకు పాసు బుక్కులు వచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో బాన్సువాడ సబ్ డీఎఫ్‌వో సాగర్, రెంజ్ అధికారి సంజయ్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.

టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బాన్సువాడ: బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం ఆలయ 9వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఆలయ ధర్మకర్తలు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, పుష్ప దంపతులతో పాటు పరిగె శంభురెడ్డి, ప్రమీల పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఉత్సవాలను భక్తులు విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

దుర్గామాత ఆలయ వార్షికోత్సవం

బాన్సువాడ పట్టణంలోని కోటగల్లీలో ఉన్న దుర్గామాత ఆలయ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బోనాల ఊరేగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పుష్ప దంపతులు హాజరయ్యారు. అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, పిట్ల శ్రీధర్, గురువినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపులో పాల్గొన్న పోచారం దంపతులు

పాఠశాలల్లో స్వయంపాలన దినోత్సవం



వదల్‌పర్తిలో పాల్గొన్న విద్యార్థులు



నాగారం పాఠశాలలో..

నాగిరెడ్డిపేట: మండలంలోని నాగిరెడ్డిపేట, వదల్‌పర్తి, జలాల్‌పూర్, రాఘవపల్లి పాఠశాలల్లో గురువారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లోని 5, 6, 7వ తరగతులకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు దేవయ్య, కరుణాకర్, రవీందర్‌తో, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాగారంలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని నాగారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరికి రెండు రోజుల జైలు

గాంధారి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఒకరికి ఎల్లారెడ్డి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై ఆంజనేయులు గురువారం తెలిపారు. డ్రంకన్ డ్రైవ్‌లో మండలంలోని మొండిసడక్‌కు చెందిన మెగావత్ నరేశ్ పట్టుబడడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు పరిశీలించిన జడ్జి నరేశ్‌కు రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కడుపు కోత..

● కుమారుడికి తలకొరివి పెట్టిన తల్లి

భిక్కనూరు: బిడ్డకు పాలు పట్టిన ఆ చేతితోనే తలకొరివి పెట్టాల్సి వచ్చిందంటూ ఆ తల్లి గుండెలు బాదుకుంటూ రోదించింది. కొన్నేళ్ల క్రితమే భర్త మృతి చెందడం, ఉన్న ఒక్క కుమారుడు తనను బాగా చూసుకుంటాడనుకున్న ఆ తల్లికి విషాద ఘటనే ఎదురైంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన వెంకటమ్మ కుమారుడు వేణుగోపాల్‌తో కలిసి ఉంటోంది. వీరు గ్రామంలో పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. వేణుగోపాల్ బుధవారం చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. గురువారం నిర్వహించిన అంత్యక్రియల్లో తల్లి వెంకటమ్మ కుమారుడికి తలకొరివి పెట్టింది. తనకు తల కొరివి పెట్టాల్సిన కొడుకుకు తానే తలకొరివి పెట్టాల్సి వచ్చిందంటూ ఆ తల్లి చేసిన రోదనలు పలువురిని కంటతడి పెట్టించింది. కాగా వేణుగోపాల్‌కు వివాహం కాగా భార్య విడాకులు తీసుకుంది. దీంతో తల్లి వెంకటమ్మనే కుమారుడికి తలకొరివి పెట్టింది.

రూ.లక్ష మాయం

వర్ని (చందూర్): స్నేహితుడు ఇచ్చిన రూ.లక్షను టిఫిన్ బ్యాగ్‌లో పెట్టి పక్కనే ఉన్న వారితో మాట్లాడుతుండగా బ్యాగ్‌తోపాటు రూ.లక్ష నగదు మాయమయ్యాయి. ఈ ఘటన చందూర్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలుఇలా ఉ న్నాయి.. గోవూర్ హైస్కూల్ హెచ్‌ఎం మోతీలాల్‌కు చందూర్ బస్టాండ్‌లో ఓ స్నేహితుడు రూ.లక్ష నగదు ఇవ్వగా, అతడు టిఫిన్ బ్యాగ్‌లో పెట్టి పక్కనే ఉన్న బైక్ హ్యాండిల్‌కు తగిలించాడు. స్నేహితులతో మాట్లాడిన మోతీలాల్ పదినిమిషాల తరువాత చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. తనబైక్ అనుకుని వేరే బైక్‌కు బ్యాగ్ వేయడం వల్లే ఈ ఘట న జరిగింది. బాధితుడు పోలీసు లకు ఫిర్యాదు చేసినప్పటికీ.. సీసీ ఫుటేజీ, సరైన ఆధారాలు లేకపోవడంతో వారు చేతులెత్తేసినట్లు తెలిసింది.

తల్లీకొడుకు అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఓ కంటి ఆస్పత్రిలో చికిత్స కోసం వచ్చిన తల్లీకొడుకు అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోమటిపల్లికి చెందిన పల్లపు రాజు అతని భార్య భవానీ, చిన్న కుమారుడు శరత్‌తో కలిసి కామారెడ్డిలోని ఓ కంటి ఆస్పత్రికి వచ్చా రు. రాజు మెడికల్ షాప్‌లో మందులు కొనడానికి వెళ్లి వచ్చేసరికి ఆస్పత్రిలో అతని భార్య, కుమారుడు కనిపించలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. దీంతో రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి

ఖలీల్‌వాడి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ శంకర్ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వు విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శంకర్ ఈ నెల 12న ఆర్మూర్ టౌన్ పీఎస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో జిల్లా ప్రభుత్వ వైద్యుల సూచన మేరకు కుటుంబీకులు హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. డీసీపీ శంకర్‌నాయక్ కానిస్టేబుల్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. నివాళులు అర్పించిన వారిలో ఏసీపీ నాగయ్య, రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకటి, ఆర్ ఎస్సై దత్తు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు షకీల్ పాషా, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



నివాళులు అర్పిస్తున్న డీసీపీ శంకర్ నాయక్

భయం వీడితేనే విజయం తథ్యం



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

● కలెక్టర్ జితేష్ వి పాటిల్

తాడ్వాయి: విద్యార్థులు పరీక్షలపై భయం వీడితేనే విజయం పొందుతారని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో గురువారం హెల్పింగ్ బ్రిడ్జ్‌ఫర్‌ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన విజయ స్ఫూర్తి కార్యక్రమానికి కలెక్టర్ హాజరై మాట్లాడారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి తొలిమెట్టు అని అన్నారు. ప్రణాళికతో ముందుకు సాగితే విజయం తథ్యమన్నారు. ప్రతివిద్యార్థి ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి గ్రేడ్లు సాధించాలని సూచించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సయ్యద్‌సాజిద్‌అలీ, ఎంఈవో రామస్వామి, సంస్థ ప్రతినిధులు కృష్ణాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రశంసించిన కలెక్టర్

రాజంపేట: అంతర్జాతీయ 'పై' దినోత్సవం సందర్భంగా పై విలువను వంద దశాంశ స్థానాల వరకు అనర్గళంగా చదివిన మండలంలోని తలమడ్ల ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రశంసించారు. అంతర్జాతీయ పై దినోత్సవం సందర్భంగా తాడ్వాయి మండలంలోని కేజీబీవీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ వీరి ప్రతిభను చూసి ప్రశంసించారు. కార్యక్రమంలో ఎంఈవో రామస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు లక్కీడ్రా

కామారెడ్డి క్రైం: గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమక్షంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఒకటో తరగతి ప్రవేశాలకు సంబంధించిన లక్కీ డ్రా నిర్వహించారు. ఇందులో పాల్త్యా నందిని, కేతావత్ అశ్విని, బాణావత్ సహస్ర, కారంతోడ్ వరుణ్, దేవసోత్ రుత్విక్‌లను లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గిరిజన అభివృద్ధి అధికారి రజిత, అధికారులు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



డ్రా తీయిస్తున్న కలెక్టర్ పాటిల్

మద్నూర్‌లో తైబజార్ వేలం

మద్నూర్(జుక్కల్): మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో తైబజార్ వేలాన్ని గురువారం నిర్వహించినట్లు గ్రామ ప్రత్యేక అధికారి బండివార్ విజయ్ తెలిపారు. ఈ వేలంలో మద్నూర్‌కి చెందిన అవార్‌వార్ హన్మాండ్లు రూ. 13.11 లక్షలకు వేలం దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సందీప్, సిబ్బంది చంద్రకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఇసుక వేలం నిర్వహించనున్నట్లు ఆర్ఐ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్రమంగా తరలిస్తున్న ఇసుకను పట్టుకొని వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11.30లకు నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

కామారెడ్డిలో రూ. 20 లక్షల అల్ప్రాజోలం పట్టివేత

● ఒకరి అరెస్టు, పరారీలో మరొకరు

కామారెడ్డి క్రైం: కారులో తరలిస్తున్న రూ.20 లక్షల విలువైన అల్ప్రాజోలంను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. నిజామాబాద్ డివిజన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కామారెడ్డిలోని ఇంటర్నేషనల్ హోటల్ ప్రాంతంలో ప్రధానరోడ్డుపై వాహనాలను ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేస్తూ ఓ కారును ఆపారు. వెంటనే కారులోని ఓ వ్యక్తి కిందికి దిగి పారిపోగా, రాజస్థాన్ రాష్ట్రంలోని నాగౌర్ జిల్లా లాడ్ను గ్రామానికి చెందిన భవానీసింగ్ పట్టుబడ్డాడు. కారును తనిఖీ చేసి రెండు కిలోల అల్ప్రాజోలంను స్వాధీనం చేసుకున్నారు. భవానీసింగ్‌ను విచారించగా, రాజస్థాన్‌కు చెందిన ముఖేశ్‌సింగ్ నుంచి అల్ప్రాజోలం కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సుదర్శన్‌కు విక్రయించినట్లు తెలిపాడు. దీంతో పారిపోయిన వ్యక్తి సుదర్శన్‌గా పోలీసులు నిర్ధారించారు. పట్టుబడ్డ వ్యక్తిపై మాదకద్రవ్యాల నియంత్రణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. కారును కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. దాడుల్లో సహాయ ఈఎస్ చంద్రభానునాయక్, సీఐలు స్వప్న, వెంకటేశ్, ఎస్సైలు విక్రం కుమార్, నర్సింహాచారి, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్సైజ్ అధికారుల అదుపులో నిందితుడు

భార్య పుట్టింటికి వెళ్లిందని ఆత్మహత్య

వర్ని: భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని మనస్తాపంతో మండలంలోని జలాల్‌పూర్‌కు చెందిన షేక్ వహీద్(40) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భార్యాభర్తల మధ్య గొడవ కారణంగా వహీద్ భార్య రేష్మ బాన్సువాడలోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన వహీద్ గురువారం సాయంత్రం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెరువులో దూకి ఒకరు..

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన దేగాం లక్ష్మణ్ (50) చెరువులోదూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కుటుంబ కలహాలకారణంగా మనస్తాపానికి గురైన లక్ష్మణ్ బుధవారం ఇంటనుంచి బయటకు వెళ్లాడు. గురువారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో పోలీసులు బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య నర్సుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.



లక్ష్మణ్(ఫైల్)

మొరం టిప్పర్ల పట్టివేత

ఎడపల్లి: మండలంలోని బషీర్ ఫారం గ్రామ శివారులో అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్లు, జేసీబీలను పట్టుకున్నట్లు ఎస్సై విక్రం గురువారం తెలిపారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్నట్లు గుర్తించి వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల ..

నాగిరెడ్డిపేట: మండలంలోని మాల్తుమ్మెద శివారులో ఉన్న మంజీరవాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను బుధవారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై రాజు గురువారం తెలిపారు. ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వాహనాలను పీఎస్‌కు తరలించి యజమానులు, డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



పీఎస్‌లో ఉన్న ఇసుక ట్రాక్టర్లు

వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎల్పుగొండ శివారులో క్రేన్ ఢీకొట్టిన ఘటనలో సగ్గిడి రాజయ్య (71) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చేపలువేటాడి జీవించే ఎల్పుగొండకు చెందిన రాజయ్య (71) పాల్వంచ మర్రి వద్దకు వెళ్లి ఎల్పుగొండకు నడుచుకుంటూ తిరిగి వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీని బైక్ ఢీకొని..

వేల్పూర్: మండలంలోని పడగల్ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం సాయంత్రం లారీని వెనుక నుంచి బైక్ ఢీకొన్న ఘటనలో గొడికె రమేశ్(35) మృతి చెందినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. వివరాలు ఉన్నాయి.. పడగల్‌కు చెందిన రమేశ్ తన సోదరుడిని వేల్పూర్ క్రాస్‌రోడ్డు వద్ద దింపి, తిరిగి వస్తుండగా, ముందు వెళ్తున్న లారీని డ్రైవర్ ఆకస్మికంగా ఎడమవైపు తిప్పాడు. వెనకాలే ఉన్న రమేశ్ లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం అతడిని వెంటనే ఆర్మూర్‌కు తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. నిర్లక్ష్యంగా లారీని నడిపిన డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఈతకు వెళ్లి యువకుడు..

ఎడపల్లి: మండల కేంద్రానికి చెందిన గొర్రెల కాపరి నవీన్(22) స్నేహితులతో కలిసి మండలంలోని వడ్డాపల్లి గ్రామశివారులోని నిజాంసాగర్ డి–46 కాలువలో ఈతకు వెళ్లాడు. ఈత కొట్టే ప్రయత్నంలో నీటిప్రవాహానికి కొట్టుకుపోయాడు. వెంటనే అతడి స్నేహితులు పోలీసులకు సమాచారం అందించారు. నీటి విడుదలను నిలిపివేయించి నవీన్ ఆచూకీ కోసం పోలీసులు వెతకగా మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత..

ఇందల్వాయి: మండలంలోని వెంగళ్‌పాడ్ గ్రామ పరిధిలోని పాటితండాలో కవిత(24) అనే వివాహిత గురువారం సాయంత్రం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మేఘ్యానాయక్ తండాకి చెందిన కవితకు పాటితండాకి చెందిన బాల్‌సింగ్‌తో పెళ్లికాగా, కొడుకు, కూతురు ఉన్నారు. కవిత మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె బంధువులు ఆందోళనకు దిగడంతో సీఐ మల్లేశ్, ఎస్సై మనోజ్ పాటితండాకు చేరుకొని వివరాలు సేకరించారు.

విద్యుత్‌షాక్‌తో ఒకరు..

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి)లో గురువారం విద్యుత్ స్తంభం ఎక్కి పని చేస్తుండగా విద్యుత్‌షాక్ తగిలి షేక్ అంజాద్ (35) మృతి చెందినట్లు డిచ్‌పల్లి ఎస్సై యూ మహేశ్ తెలిపారు. నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్ కాలనీకి చెందిన అంజాద్ ధర్మారంలో విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మతులు చేస్తుండగా, షాక్ తగిలి కింద పడిపోయాడు.అంజాద్‌ను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

ఖలీల్‌వాడి : నగరంలోని అర్సపల్లి రైల్వేట్రాక్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని రాజు(30) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. బోధన్ రోడ్డు నుంచి అర్సపల్లిలోని ఇంటికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని రాజు మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కులంపేరుతో దూషించినఎనిమిది మందికి జైలుశిక్ష

ఖలీల్‌వాడి: వ్యక్తిని కులం పేరుతో దూషించి గాయపర్చిన ఎనిమిది మందికి ఒక్కొక్కరికి సంవత్సరం జైలుశిక్ష విధిస్తూ నిజామాబాద్ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచారాల నిరోధక విచారణ న్యాయస్థానం స్పెషల్ జడ్జి టి.శ్రీనివాస్ గురువారం తీర్పు వెలువరించారు. ఏపీపీ బంటు వసంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మాక్లూర్ మండలం మదనపల్లికి చెందిన బోపతి ప్రభాకర్ 2020 జనవరి 26 వరకు వీడీసీ కోశాధికారిగా పని చేశాడు. ఆలయానికి విరాళం విషయంలో గ్రామానికి చెందిన ఒడ్డెన్న ప్రభాకర్‌తో గొడవపడి కులంపేరుతో దూషించాడు. అనంతరం గోవూర్ రమేశ్, గోవూర్ చిన్నపోతన్న, దూంపతి సాయన్న, పురం సాయిలు, పురం ఒడ్డెన్న, పురం రవి, గోవుర్ రాజుతో కలిసి ప్రభాకర్‌పై దాడి చేశారు. నిందితులకు న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

కోళ్లపందెం స్థావరంపై దాడి

● ఆరుగురి అరెస్ట్

● నగదు, తొమ్మిది కోళ్లు స్వాధీనం

రుద్రూర్ : మండలకేంద్రం శివారులోని గూండ్లవాగు సమీపంలో కొనసాగుతున్న కోళ్ల పందెం స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ జయేశ్‌రెడ్డి తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేశామని, పట్టుబడిన వారి నుంచి రూ.4,760 నగదుతోపాటు 9 కోళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): బహిరంగ ప్రదేశంలో మద్యం సేవించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. అలాగే, వాహనాలను తనిఖీ చేసి నంబర్‌ప్లేట్లు లేని వాహనాలను ఆర్టీవో కార్యాలయానికి తరలించామన్నారు. మద్యం సేవించి వాహనలు నడిపితే చర్యలు తప్పవన్నారు.